ఆధునిక విజ్ఞాన భాండాగారం





పౌర గ్రంథాలయంలో కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

- మోడల్ లైబ్రరీగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయం
- పోటీ పరీక్షల విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం
- అందుబాటులో 70 వేలకుపైగా పుస్తకాలు
- నాలుగు అంతస్తుల్లో రీడింగ్ రూమ్స్, మీటింగ్ హాల్స్
- పలు రంగాల నిపుణులచే కెరీర్ గైడెన్స్
- పిల్లల కోసం ప్రత్యేక విభాగం



విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న సీపీ రవిశంకర్ (ఫైల్)

సీతంపేట : ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో ఏ చిన్న విషయం తెలుసుకోవాలన్నా యువత గూగుల్‌పై ఆధారపడుతున్న రోజులివి. పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గింది. పాఠ్య పుస్తకాలు సైతం ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లో అందిస్తున్న రోజులు. గ్రంథాలయాలకు ఆదరణ కరువైందన్న మాట ప్రతి నోటా వింటున్నాం. అయితే అది నిజం కాదని ద్వారకానగర్‌లోని విశాఖపట్టణం పౌరగ్రంథాలయాన్ని సందర్శిస్తే ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. గ్రంథాలయం అంటే ఏదో నాలుగు రకాల న్యూస్ పేపర్లు, పది రకాల పుస్తకాలు ఉంటే సరిపోదు... పాఠకుల అభిరుచి, అవసరాలకు తగినట్టు సౌకర్యాలు కల్పిస్తే ఇంటర్నెట్ కాలంలో కూడా గ్రంథాలయాలకు ఆదరణ తగ్గదని, గ్రంథాలయం అంటే ఎలా ఉండాలో, ఎలాంటి సౌకర్యాలుంటే పాఠకుల నుంచి ఆదరణ లభిస్తోందో నిరూపిస్తోంది విశాఖపట్నం పౌరగ్రంథాలయం. గత పదేళ్లలో పాలకవర్గం కల్పించిన ఆధునిక సదుపాయాలతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కేరాఫ్ అడ్రస్‌గా పౌర గ్రంథాలయం మారింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే పౌర గ్రంథాలయానికి వెళ్లాల్సిందే అని చెప్పేంతగా పేరు సొంతం చేసుకుంది. విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లా నుంచి వచ్చిన విద్యార్థులు సమీప ప్రాంతాల్లోని అద్దె ఇళ్లల్లో ఉంటూ పౌరగ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. నగరంలో ఏకైక మోడల్ లైబ్రరీగా ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంది.

పాఠకులకు సౌకర్యవంతంగా...

గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థులు చదువుకునేందుకు పచ్చని చెట్ల మధ్య బెంచీలు, ఏసీ రీడింగ్ హాల్స్, తాగునీరు, అధునాతన టాయిలెట్లు, పోటీ పరీక్షలకు అవసరమైన రిఫరెన్సు పుస్తకాలు, నిపుణులచే ప్రతి నెలా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, క్విజ్ పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గ్రంథాలయం నీడన ఇప్పటి వరకు చదువుకున్న విద్యార్థుల్లో 480 మంది బ్యాంక్స్, గ్రూప్స్, టీచర్స్, రైల్వే, సచివాలయం, ఎస్ఎస్‌సీ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారంటే ఆశ్చర్యం కలగకమానదు.



పిల్లల కోసం ప్రత్యేకంగా మియావాకీ సెంటర్



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఇదీ సమగ్ర స్వరూపం

లైబ్రరీలో పుస్తకాలు	: 70,000
జీవితకాల సభ్యులు	: 51,468
యాక్టివ్ మెంబర్స్	: 4,000
డైలీ పాఠకులు	: 800 నుంచి 1000 మంది
సభ్యత్వ రుసుము ఏడాదికి	: రూ.300
ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు	: సుమారు 480 మంది (గడిచిన ఏడేళ్లలో).

ఇదీ ద్వారకానగర్‌లో గల విశాఖపట్నం పౌర గ్రంథాలయం ట్రాక్ రికార్డు... గ్రంథాలయాల ఆదరణకు ఇంతకంటే ఏం లెక్కలు కావాలి..!!



ర్యాక్స్‌లో అందుబాటులో విలువైన పుస్తకాలు



గ్రంథాలయంలో పిల్లలకు స్టోరీ టెల్లింగ్

విద్యార్థుల అవసరాలకు తగినట్టు ...

పోటీ పరీక్షల విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన సదుపాయాలు కల్పించి ఒక మోడల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దాం. రోజూ 800 నుంచి 1000 మంది విద్యార్థులు ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ఆన్‌లైన్‌లో నమూనా పరీక్షలు రాయడానికి, ఈ – బుక్స్ చదివించేందుకు సభ్యులకు ఉచితంగా వైఫై అందుబాటులోకి తేవాలని సన్నాహాలు చేస్తున్నాం. యువతీ, యువకులు వేర్వేరుగా పోటీ పరీక్షలకు చదువుకునేందుకు అత్యాధునిక ఏసీ రీడింగ్ రూమ్స్, ప్రత్యేకంగా రూపొందించిన మియావాకీ సెంటర్‌లో పిల్లలకు స్టోరీ టెల్లింగ్, క్రాఫ్ట్ మేకింగ్, విద్యార్థులకు నిపుణులచే కెరీర్ గైడెన్స్ లెక్చర్స్, క్విజ్ పోటీలు, సందేహాల నివృత్తి, గైడెన్స్ కోసం చర్చా సమావేశ మందిరం అందుబాటులోకి తీసుకొచ్చాం.

– డి.ఎస్.వర్మ కార్యదర్శి, పౌరగ్రంథాలయం సొసైటీ

రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ

పాఠకుల అభిరుచికి తగినట్టు ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో నానాటికీ ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వందలాది మంది విద్యార్థుకు ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావణం కల్పించారు. రెండు వేల చదరపు గజాల స్థలంలో నాలుగు అంతస్థుల భవనంలో పూర్తి స్థాయిలో పుస్తక, సాహిత్య ప్రియులకు సేవలందిస్తున్నారు. రోజూ 800 నుంచి 1000 మంది యువతీ యువకులు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఇక్కడకు వస్తుంటారు. లంచ్ బాక్సులు పట్టుకుని ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రంథాలయ ఆవరణలో కూర్చుని చదువుకుంటుంటారు. విద్యార్థులు చదువుకునేందుకు మంచి వాతావరణం, పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్, పుస్తకాలు, వార్తా పత్రికలు, మేగజైన్స్‌ను లైబ్రరీ సొసైటీ అందుబాటులో ఉంచింది. సాహిత్యం, జనరల్ నాలెడ్జి, కాంపిటేటివ్, చిల్డ్రన్ బుక్స్, రిఫరెన్స్ బుక్స్, జనరల్ బుక్స్ కలిపి మొత్తం 70 వేల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.



కెరీర్ గైడెన్స్‌పై లెక్చర్ ఇస్తున్న కలెక్టర్ మల్లికార్జున (ఫైల్)

ఆహ్లాదకర వాతావరణం



నేను పీజీ చదివాను. ఏడాదిన్నర కాలంగా పౌర గ్రంథాలయానికి వస్తున్నా. ఇటీవల ఐబీపీఎస్ బ్యాంకింగ్ సెక్టార్‌లో జాబ్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం జనవరిలో జరగనున్న ఎస్ఎస్‌సీ సీజీఎల్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. లైబ్రరీలో చదువుకోవడానికి మంచి ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణం కల్పించారు. నా వల్ల నా స్నేహితులు మరో 15 మంది రోజూ లైబ్రరీకి వస్తున్నారు.

– ఓ.గణేష్, విద్యార్థి, ఎంవీపీ కాలనీ.

విద్యార్థులకు సౌలభ్యంగా...



మాది కాకినాడ జిల్లా. ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. ఇక్కడ రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నా. నగరంలో ఎక్కడ చూసినా రీడింగ్ రూమ్స్ నెలకు రెండు వేల నుంచి 3500 వరకు వసూలు చేస్తున్నారు. గూగుల్ రివ్యూస్‌లో చూసి పౌర గ్రంథాలయానికి వచ్చాను. ఇక్కడ వాతావరణం బాగా నచ్చింది. గత రెండేళ్లుగా క్రమం తప్పకుండా వస్తున్నా. నాలాంటి విద్యార్థులు ఆర్థిక భారం లేకుండా ఇక్కడ చదువుకోవచ్చు. ఏసీ రీడింగ్ రూమ్ కోసం నెలకి రూ.250 చెల్లిస్తున్నా.

– ఎస్.తాతాజీ, విద్యార్థి, కాకినాడ

క్లుప్తంగా

అన్ని దానాల్లో అన్నదానమే మిన్న



పూజల్లో పాల్గొన్న కేకే రాజు, తదితరులు

సీతమ్మధార : అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ శాంతి స్వరూపిణి ఆలయ ఆవరణలో కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఒక యజ్ఞంలా భావించి అన్నదానం చేస్తున్న వారిని అభినందించారు. ఆకలితో ఉన్నవారికి పట్టెడు అన్నం పెడితే వచ్చే పుణ్యం ఎన్ని యజ్ఞాలు చేసినా రాదన్నారు. మాలధారులకు కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానమందిరంలో అన్నదానం



అల్పాహారం అందజేస్తున్న పైల శివతేజ ఫౌండేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం : సీనియర్ పాత్రికేయుడు పైల దివాకర్ కుమారుడు పైల శివతేజ 31వ జయంతి సందర్భంగా పైల శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం రైల్వే న్యూ కాలనీ జంక్షన్ వద్ద పేదలు, యాచకులకు అల్పాహారం అందజేశారు. రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో జాతీయ జర్నలిస్టుల సంఘం నాయకుడు గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. ముందుగా శివతేజ చిత్రపటానికి పైల దివాకర్, పైల వెంకటరమణి, నారా నాగేశ్వరరావు, స్నేహితులు నివాళులర్పించారు.

బాక్సింగ్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

సీతంపేట : బాక్సింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాక్సింగ్ మహిళల, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 15, 16న ఏయూ బాక్సింగ్ హాల్‌లో నిర్వహించారు. పురుషుల, మహిళల విభాగంలోనూ బుల్లయ్య విద్యార్థులు టీం చాంపియన్ షిప్ గెలుపొందారు. ఇంజినీరింగ్ విద్యార్థిని ఎస్.జి.జె.ఎస్.మల్లిక 52 కిలోల విభాగంలో బెస్ట్ బాక్సర్ టైటిల్ గెలుపొందారు. డిగ్రీ విద్యార్థి ఎండీ హీన కౌసర్ బెస్ట్ లూజర్ టైటిల్ గెలుచుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ జి.మధు కుమార్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, వ్యాయామ విభాగాధిపతి, పీడీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మద్రిపాలెం : ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు దాటుతున్న మాధవ్ ప్రధాన్ (55)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఊర్వశి జంక్షన్ నుంచి బిర్లా కూడలి వైపు మార్గ మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంచి సినిమాలను ఆదరించాలి



నందకిషోర్, అరుణ్‌దేవ్‌ను సత్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో '35 చిన్నకథ కాదు' తెలుగు సినిమా ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకుడు నందకిషోర్ మాట్లాడుతూ మానవ సంబంధాలు ఇతివృత్తంగా నిర్మించిన '35 చిన్న కథ కాదు' సినిమా మంచి ప్రేక్షకాదరణ పొందిందన్నారు. మంచి సినిమాలను ఆదరించాలని, తక్కువ బడ్జెట్‌తో రూపొందించిన తమ చిత్రం పలు అవార్డులు సాధించిందని తెలిపారు. విశాఖలోనే తను చదువుకున్నానని, విశాఖతో మంచి అనుబంధం ఉందన్నారు. అనంతరం దర్శకుడు కిషోర్, బాల నటుడు అరుణ్‌దేవ్‌ను ఘనంగా సత్కరించారు. సొసైటీ ప్రతినిధులు నరవ ప్రకాశరావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, ఉషారాణి, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, రాంప్రభు, పౌరగ్రంథాలయం సంయుక్త కార్యదర్శి డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభోశంకర



స్పటికలింగ శివుడు



అలంకరణలో పార్వతీశ్వరుడు



అభిషేకం చేస్తున్న రామారావుశర్మ



కోదండ కాశీవిశ్వేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సీతంపేట, సీతమ్మధార, కంచరపాలెం, మద్రిపాలెం : కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో భక్తులు క్షీరాభిషేకాలు, అర్చనలు చేశారు. ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. సీతంపేటలోని పార్వతీశ్వరుడు రజత కవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రమాభాయి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈవో ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు రామారావు శర్మ, ఉమామహేష్ పూజలు నిర్వహించారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

➡ 104 ఏరియా బాపూజీనగర్, కోదండ కాశీవిశ్వేశ్వరాలయంలో ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు, అర్చకులు ఎం.సూర్యప్రకాశ్‌శర్మ, తిక్కవానిపాలెంలోని అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో రామకృష్ణశర్మ, కంచరపాలెం గౌరీ పరమేశ్వరాలయంలో అర్చకులు శ్రీనివాస దీక్షితులు, సుభాష్‌నగర్‌లో ధర్మగర్భ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు జగన్మోహన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

➡ జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడాకాలనీలోని అమృతలింగేశ్వర స్వామి స్పటిక లింగం శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గాంధీ నగర్ – 2 ఈస్ట్‌పార్కు సమీపంలోని హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పరుల హితమే జగద్గురు పీఠం లక్ష్యం



మాట్లాడుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు

తాటిచెట్లపాలెం: దేశ విదేశాల్లో ఐదున్నర దశాబ్దాలుగా ఆధ్యాత్మిక, సామాజిక సేవల ద్వారా పరుల హితం కోసం జగద్గురుపీఠం పనిచేస్తోందని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తెలిపారు. జగద్గురుపీఠం 54వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ ఇ.కె.సంస్మృతి సదన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ నెలకొల్పిన మాస్టర్ ఇ.కె రచనలు, త్యాగనిరతి ఆచరణాత్మకమైనవని తెలిపారు. అనంతరం సంస్మృతి సదన్‌లో సేవలందిస్తున్న వైద్య బృందం సభ్యులను ఘనంగా సన్మానించారు. జనశిక్షణ సంస్థాన్ సహకారంతో బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్లను సీపీ రామరాజు అందజేశారు. జగద్గురుపీఠం డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్, ట్రస్ట్ భౌగోళిక అధ్యక్షుడు కె.గురుప్రసాద్, ట్రస్ట్ సభ్యులు బి.ఉషారాణి, దాట్ల కృష్ణవర్మ, ఎస్‌వీ సత్యనారాయణ, డి.నాగమణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జెడ్సీ శివప్రసాద్, అధికారులు

కంచరపాలెం : జ్ఞానాపురం జోన్ – 5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నలుగురు వినతులు అందజేశారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, ఇంజినీరింగ్ విభాగానికి 02 వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. ప్రతీ సోమ వారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధికారులు, ఇతర సిబ్బంది ఖచ్చితంగా హాజ రుకావాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వో రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏఈ అర్చన, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ కుమార్, ఏఈ సుమన్ పాల్గొన్నారు.

సీతమ్మధార : నగరంలోని ఆశీలమెట్టలో గల జోన్ – 3 కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ముగ్గురు ఫిర్యాదు చేశారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించా లని కోరారు. ఫిర్యాదుల పరిష్కారం సమాచారం ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి, టీపీఎస్ నారాయణరావు, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము, ఆర్‌వో పైడిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఐదుగురు అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామలక్ష్మి, ఆర్ఐ ప్రేమలత, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ ఇబ్రహీం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం



రాధాకృష్ణులకు హారతిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యుడు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని లాంసన్‌గ్రీన్ అపార్ట్‌మెంట్ ఆవరణలో అపార్ట్‌మెంట్ నివాసితుల సంక్షేమ సంఘం సహకారంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణుల చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఎండాడలోని శ్రీ నితాయి గౌరంగా మందిరంలో నెల రోజులపాటు రోజూ సాయంత్రం దీపోత్సవం నిర్వహిస్తున్నామని, నగరంలోని భక్తులు ఎండాడ రావడం కష్టతరం కాబట్టి వాడవాడలా దీపోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సంకీర్తన, దామోదర హారతి, దామోదర అష్టకం, భక్తులచే నెయ్యి దీపాల హారతి, ప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రుద్రాక్ష పూజ

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో వెలసిన ఉమారామలింగేశ్వరాయంలో కార్తీక మాసం మంగళవారం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం అనంతరం శివుడి జన్మ నక్షత్రం ఆరుద్ర అయినందున 9 గంటలకు రుద్రాక్షలతో పూజ, గణపతి, సుబ్రహ్మణ్య సహిత రుద్ర హోమం నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం ఆకాశ దీపారాధన నిర్వహిస్తామని, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

ఉత్సాహంగా పాటల పోటీలు



పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్ : మురళీనగర్ మహిళలు, బాలల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు సోమవారం పాటల పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్‌కు ప్రత్యేక విభాగాలుగా దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 40 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు వారోత్సవాల ముంగింపు రోజున బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ వై.పద్మజ చెప్పారు. గౌరీ డిగ్రీ కాలేజీ నుంచి ఉపాధ్యాయురాలు పి.కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరై పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో పి.కోటేశ్వరరావు, ఎ.విక్కీ, కె.లీల, రమణ మాస్టర్, పాఠకులు పాల్గొన్నారు.